క్లుప్తంగా

రామభద్రపురంలో దొంగలు పడ్డారు..



దొంగలు కోసేసిన షాపు పైభాగం

రామభద్రపురం: స్థానిక శివాలయం ఎదురుగా ఉన్న ఓ సూపర్ మార్కెట్‌లో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. షాపుపైనున్న వరన్ రూఫ్, సీలింగ్‌ను కోసేసి, షాపులోకి సులువుగా దిగారు. అందులోని నిత్యవసర సరుకులు, సౌందర్య సాధనాలను దొంగిలించారు. వాటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని, షాపు యజమాని చొక్కాపు వెంకటనాయుడు తెలిపారు. ఈ ఘటనపై షాపు యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అక్కడి సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్‌ఐ సురేంద్రనాయుడు తెలిపారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



ఉప్పర్నాయుడువలసలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

రేగిడి: మండలంలోని బాటాయివలస గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న ఉప్పర్నాయుడువలస గ్రామంలో అభివృద్ధి పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షల నిధులు మంజూరు కాగా, వీటితో 800 మీటర్ల పొడవునా సీసీ రోడ్డు, 800 మీటర్ల పొడవునా మురుగుకాలువలు నిర్మిస్తున్నామని సర్పంచ్ కరణం గోవిందరావు తెలిపారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



బాడంగి మండల విద్యావనరుల కేంద్రంలో డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు

బాడంగి: విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేసి, పాఠ్యప్రణాళిక ప్రకారం సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని బొబ్బిలి డివిజన్ డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మానందరావు సూచించారు. మంగళవారం స్థానిక విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించిన ఆయన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరీక్షించి, చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల నోట్‌బుక్‌లు, అసైన్‌మెంట్లు చూడాలన్నారు. బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

రాజాం: స్థానిక మల్లికార్జున కాలనీలోని చౌడేశ్వరిదేవి ఆలయ 28వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. రాజాం వాసులతో పాటు రాజాం చుట్టుపక్కల ప్రాంతాల వారు ఈ పూజల్లో పాల్గొని, అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

రేగిడిలో సుబ్రహ్మణ్యస్వామికి..

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబకండి, సంకిలి గ్రామాల్లోని ఆలయాల్లో సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆమదాలవలస ఆలయ పూజారి కిన్నెరకాంతం అన్నారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో భక్తులు పాల్గొని, స్వామి దర్శనం చేసుకున్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన

వంగర: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని బొబ్బిలి డివిజన్ డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన ఆయన పాఠశాలల్లో డిజిటల్ బోధనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని తెలిపారు. అనంతరం పాఠశాలల వారీగా యూడైస్ ప్లస్ అప్‌డేషన్, బయోమెట్రిక్ అటెండెన్స్ నిర్వహణ, నాడు-నేడు స్టేజ్-2 పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ వై.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశస్తి యాప్‌లో దివ్యాంగుల వివరాలు

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, బాలికల పాఠశాల, హరిజన వాడ పాఠశాలల్లో ప్రశస్తి యాప్ ద్వారా దివ్యాంగులైన విద్యార్థుల వివరాలను మంగళవారం నమోదు చేశారు. ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ఈ యాప్‌ను ప్రతీ ప్రభుత్వ ఉపాధ్యాయుడు డౌన్‌లోడ్ చేసుకుని, దివ్యాంగుల వివరాలను నమోదు చేయాలని ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు.

బొబ్బిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన ఎంఈఓ చల్ల లక్ష్మణరావు ప్రత్యేకావసరాలు గల పిల్లల వివరాలను ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రశస్తి యాప్‌లో పొందుపరచాలని సూచించారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ లబ్ధి



రాజాం సిటీ: లచ్చయ్యపేట సచివాలయంలో అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



బొబ్బిలి: కలువరాయిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

గ్రామ గ్రామాన ఓ ఉద్యమంలా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు, పథకాలపై ఆరాతీసి, అవి వారికి అందేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో అర్హులకు గంటల వ్యవధిలో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. మంగళవారం పలు గ్రామాల్లో అర్జీదారులకు జనన, మరణ, కుల, ఆదాయం వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా అందజేశారు. ఈ కార్యక్రమంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

–బొబ్బిలి, రాజాం సాక్షి నెట్‌వర్క్



రాజాం: కంచరాంలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ రాజగోపాలనాయుడు



బొబ్బిలి: చిత్రకోట బొడ్డవలసలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ శాంతకుమారి, ఆర్‌డీఓ శేషశైలజ



రామభద్రపురం సచివాలయం-1లో కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, తహసీల్దార్ రాజారావు



తెర్లాం: సుందరాడలో లబ్ధిదారులకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి



బాడంగి: గొల్లాదిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గౌరు, తదితరులు



సంతకవిటి: కొండగూడెంలో దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాల అందజేత



మెంటాడ: తమ్మిరాజుపేట గ్రామంలో తాము అందుకున్న ధ్రువీకరణ పత్రాలు చూపిస్తున్న లబ్ధిదారులు



వంగర: రాజులగుమ్మడలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

ఉద్దవోలు.. ప్రశాంతం..



ఉద్దవోలులో ఓ వీధిలో నెలకొన్న ప్రశాంత వాతావరణం

తెర్లాం: ఏగిరెడ్డి కృష్ణ మాస్టారు హత్యతో ఆయన స్వగ్రామం మండలంలోని ఉద్దవోలు బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానుల ఆందోళనలతో నిన్నమొన్నటి వరకు అట్టుడికిపోయింది. ఇప్పుడు గ్రామంలో శాంతిభద్రతలు అదుపులోకి వచ్చాయని, గ్రామం ప్రశాంతంగా ఉందని ఎస్‌ఐ ఆర్.రమేష్ మంగళవారం తెలిపారు. ఉపాధ్యాయుడు, మాజీ సర్పంచ్ అయిన ఏగిరెడ్డి కృష్ణను ఆయన గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ పికెట్ నిర్వహించడంతో పాటు, 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. గ్రామంలో గత రెండు రోజులుగా ప్రశాంత వాతావరణం నెలకొందని, ప్రజలు కూడా సంయమనం పాటించారన్నారు. గ్రామంలో 13 మందితో పోలీస్ పికెట్‌ను కొనసాగిస్తున్నామన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి

రాజాం సిటీ: ఓటర్ల జాబితా సవరణకు అన్ని పార్టీల నాయకులు సహకరించండి అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.పద్మలత కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఆమె ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించిన ప్రక్రియను ముమ్మరం చేశామని, చాలా ప్రాంతాల్లో ఈ ప్రక్రియ చాలా చురుగ్గా జరుగుతోందన్నారు. పార్టీలకు అతీతంగా ఎటువంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితా తయారీకి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ బి.ప్రకాష్‌రాజు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన తహసీల్దార్ రఫీజాన్ పక్కాగా తయారు చేసే ఓటర్ల జాబితాకు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామభద్రపురం: మండలంలోని నాయుడువలస గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు సంబంధించి, అర్హులైన ఓసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ, రాజ్యలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు జూలై 01, 2023 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి, స్థానిక వివాహిత అయి ఉండి, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారై ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారితో సంతకం చేయించిన కులం, విద్యార్హత, వయసు, నివాసం వంటి ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలు అందజేయాలన్నారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

వన్నలిలో '104' వైద్యసేవలు



వన్నలిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యారోగ్య సిబ్బంది

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో 104 అంబులెన్స్ ద్వారా గ్రామస్తులకు మంగళవారం వైద్య సేవలు అందజేశారు. శిబిరానికి హాజరైన ఒక్కొక్కరి ఆరోగ్య తనిఖీలను సిబ్బంది చేపట్టి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలతో పాటు 64 రకాల మందులు అందజేస్తున్నామని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి సోహినీ రాఘవ్ తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, అందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి.ప్రియా, ఏఎన్ఎం రాజేశ్వరి, సర్పంచ్ జి.రమణ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాడంగిలో వర్షం

బాడంగి: మండలంలో సోమ, మంగళవారం వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి నారుమడులకు మంచి పదును అందిందని రైతులు చెబుతున్నారు. అలాగే మెట్టుభూముల్లో సాగు చేసే చెరకు, గోగు, వేరుశనగ, నువ్వు, వరి వెదలు, కూరగాయ పంటలకు కూడా వర్షం మంచి దేనంటున్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణ పరిధిలోని వస్త్రపురికాలనీలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు సాదరస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా తెలియజేయాలన్నారు. గతంలో లాగా లంచాలకు తావులేకుండా పథకాలు, ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఓ వైపు అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా అభివృద్ధి పనులు చేయడంతో పాటు అన్ని వర్గాల వారికి న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.

సెల్ఫీలే వారికి చివరి గుర్తులు..

ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో బురదజల్లేందుకు విపక్షాలు సన్నద్ధమయ్యాయన్నారు. భవిష్యత్‌కు గ్యారంటీ పేరిట టీడీపీ చేపట్టిన బస్సుయాత్రకు అసలు జనాదరణ లేదన్నారు. ఎక్కడికి వెళ్లినా ఆ పార్టీ నేతల వెంట కనీసం వందమంది కూడా లేరన్నారు. ఇదే ఆ పార్టీపై ప్రజలకు విశ్వాసం లేదనడానికి నిదర్శమన్నారు. ఆ పార్టీకే భవిష్యత్ లేదని, అలాంటి పార్టీ రాష్ట్ర ప్రజలకు భవిష్యత్ గ్యారంటీ పేరిట బస్సుయాత్ర చేయడం హాస్యాస్పదమని ఎద్దేవాచేశారు. ప్రభుత్వం అభివృద్ధి చేయడం లేదని చూపిస్తూ ఆ పార్టీ నేతలు తీసుకుంటున్న సెల్ఫీలే వారికి చివరి గుర్తులుగా మిగిలిపోతాయని, వాటినే చూసుకుని బతికేయాల్సి ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి రాజకీయ సమాధి ఖాయమని, మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, యూత్ కన్వీనర్ వి.విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు 'జగనన్న తోడు'



రాజాం: జగనన్న తోడు పథకం ప్రారంభం సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వింటున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: చిన్న చిన్న పాన్‌షాపులు, తోపుడుబండ్ల వ్యాపారులకు జగనన్న తోడు పథకం ఆర్థిక చేయూతను అందిస్తోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఏడో విడత జగనన్న తోడు పథకాన్ని ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. అనంతరం సీఎం ప్రసంగం ద్వారా తెలుసుకున్న పథకం ప్రధాన లక్ష్యంపై ఎమ్మెల్యే లబ్ధిదారులతో కాసేపు మాట్లాడారు. రాజాం పట్టణంలో మెప్మా ద్వారా ఏడో విడతలో 584 మంది లబ్ధిదారులకు రూ.62.90 లక్షల నగదును ప్రభుత్వం అందిస్తోందని వెల్లడించారు. ఒక్కో వ్యాపారికి రూ.10 వేల వడ్డీలేని రుణం ప్రభుత్వం అందిస్తోందన్నారు. గత విడతలో లబ్ధి పొందిన వ్యాపారుల్లో 536 మందికి రూ.1.26,720 వడ్డీ రాయితీ వచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా రూ.10 వేల రుణం పొందే లబ్ధిదారులు ప్రతినెలా సకాలంలో డబ్బులు చెల్లిస్తే వడ్డీ డబ్బులను ప్రభుత్వమే చెల్లించుకుంటుందన్నారు. చిరువ్యాపారులకు భరోసా కల్పిస్తూ, వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం ఈ రుణాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, మెప్మా టీఎంసీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: జగనన్న తోడు పథకం ఏడో విడత నిధుల విడుదల కార్యక్రమ ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసారాన్ని స్థానిక సచివాలయం-2 పరిధిలోని ఆర్‌బీకేలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి మంగళవారం వీక్షించారు. చిరువ్యాపారులకు అండగా నిలిచేందుకు సీఎం జగనన్న ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఫీవర్ సర్వే చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు


బొబ్బిలి: పట్టణంలోని అన్ని వీధుల్లో ఫీవర్ సర్వే చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు శానిటేషన్ సెక్రటరీలు, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, మెప్మా, మలేరియా సిబ్బందితో సమావేశమైన ఆయన వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి, జ్వరపీడితులను గుర్తించి, అవసరమైన మందులు, వైద్యం అందేలా చూడాలన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తెర్లాం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సేవలను సద్వినియోగం చేసుకోవాలని పెరుమాళి పీహెచ్‌సీ డాక్టర్ కె.మాధవి కోరారు. మంగళవారం మండలంలోని పాములవలస గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని సాధారణ రోగులు, గర్భిణులు, దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చాలా మంచి కార్యక్రమమని, గ్రామాలకు వైద్యులను పంపించి, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండడం అభినందనీయమన్నారు.

రామభద్రపురంలో 'చెత్త' సమస్య

- కానరాని పారిశుద్ధ్య చర్యలు
- కార్మికుల సమ్మె కారణంగా దుస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు



రామభద్రపురం మెయిన్‌రోడ్డు పక్కనే గ్రంథాలయం దగ్గర పేరుకుపోయిన చెత్తాచెదారం

రామభద్రపురం: గ్రామంలో పారిశుద్ధ్య పనులు కానరావడం లేదు. దీంతో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చెత్తకుప్పల నుంచి రోడ్లు, ఇళ్ల వద్దకు చెత్త వచ్చి నిలిచిపోతోంది. దుర్వాసన వెదజల్లుతోంది. దీంతోపాటు వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రం.. ఆరోగ్యం.. ఆహ్లాదంగా గ్రామాలు మారాలి. తద్వారా ప్రజల ఆరోగ్యం మరింత మెరుగ్గా ఉండాలన్నదే ప్రభుత్వ ఆశయం. దీనికోసం జగన్ సర్కారు ప్రతీ గ్రామంలో గ్రీన్ అంబాసిడర్లను నియమిస్తూ ఇంటింటి చెత్త సేకరణ, దానిని గ్రామ శివారులోని చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తోంది. ఈ నేపథ్యంలో చాలా గ్రామాలు పారిశుద్ధ్య చర్యల వల్ల మెరిసిపోతున్నాయి. ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటున్నారు. అయితే రామభద్రపురంలో మాత్ర పరిస్థితి వేరేగా ఉంది. పారిశుద్ధ్యానికి ప్రభుత్వం ఓ వైపు కృషి చేస్తుంటే ఇక్కడి అధికారులు మాత్రం ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా పారిశుద్ధ్య పనులు జరగక గ్రామం కంపుకొడుతోంది. రామభద్రపురం మేజర్ పంచాయతీలోని పారిశుద్ధ్య కార్మికులు తమ వేతనాలు పెంచాలని ఈ నెల ఒకటో తేదీ నుంచి సమ్మె చేస్తున్నారు.

సెలవులో ఈఓ..

ఇదే అదనుగా అనారోగ్యం పేరిట పంచాయతీ ఈఓ, ఈ నెల 4వ తేదీ నుంచి సెలవు పెట్టి, వెళ్లారు. మండల ఉన్నతాధికారులు కూడా కనీసం పారిశుద్ధ్య సమస్య పరిష్కారంపై కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో పంచాయతీలో పారిశుద్ధ్యంపై పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో గ్రామంలో పారిశుద్ధ్యం కుంటిపడింది. ఏ వీధిలో చూసినా ఎక్కడికక్కడ చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు కుళ్లిన చెత్తకుప్పల నుంచి దుర్వాసన విపరీతంగా వెదజల్లుతోంది. కాలువల్లో నుంచి నీరు కూడా పోకుండా అడ్డంగా ఉన్న పూడికలతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తమై పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోతే తామంతా అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై ఇన్‌చార్జ్ ఈఓ రవికుమార్‌ను సాక్షి విలేకరులు వివరణ కోరగా, పంచాయతీలో పారిశుద్ధ్య సమస్య ఉండడం వాస్తవమేనని, పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్నారని, దీంతో ఇక్కడ పంపు ఆపరేటర్లు, మరి కొంత మందితో పారిశుద్ధ్యం పనులు చేయిస్తున్నామని, అయితే అలా పనిచేస్తున్న వారిని సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకుంటూ మా కడుపు ఎందుకు కొడుతున్నారని ప్రశ్నిస్తూ తిడుతున్నారన్నారు. అందుకే పనులు ఆపేశామని, ఈ నెల 26వ తేదీన ఈఓ మళ్లీ విధుల్లో చేరుతారని, కార్మికుల సమస్యలు పరిష్కరించి, పారిశుద్ధ్య పనులు చేయిస్తారన్నారు.



చొక్కాపు వీధిలో కనిపిస్తున్న చెత్తకుప్పలు

'జగనన్న గోరుముద్ద' పరిశీలన

రేగిడి: మండలంలో వండానపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు మంగళవారం పరిశీలించారు. రుచి, శుచితో వంటకాలు వండాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలని ఆయన సూచించారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెంచాలని కోరారు.

ఫిజియోథెరపీ సేవలపై అవగాహన

తెర్లాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫిజియోథెరపీ సేవలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ జె.త్రినాధరావు మాట్లాడుతూ శారీరక, మానసిక సమస్యలు కూడా ఫిజియోథెరపీ ద్వారా నయమవుతాయన్నారు. దివ్యాంగులైన చిన్నారులకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ అందిస్తే ఆరోగ్యం మెరుగుపడే అవకాశాలు ఎక్కువన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, పుట్టినరోజు, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com